దేవాలయాన్ని కృష్ణశిలతో నిర్మిస్తున్నాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: ఆంజనేయనగర్‌లోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శిరీష శంకుస్థాపన చేశారు. కలియుగదైవం వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కృష్ణశిలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పాండుగౌడ్, బోర్డు సభ్యులు యుగేంధర్‌సింగ్, సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, కృష్ణంరాజు, రామంజన్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆంజనేయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నేడు ఉదాసీన్‌మఠంలో..
పలు నిర్మాణాలకు శంకుస్థాపన

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని 540 ఎకరాల ఉదాసీన్ మఠంలో శుక్రవారం (మే 5) ఉదయం 11.05 గంటలకు సంత్‌నివాస్ వేద పాఠశాల, యజ్ఞశాల, గోశాల శంకుస్థాపన శ్రీమహంత్ రఘు మునీజీ ఆధ్వర్యంలో జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. కేపీహెచ్‌బీ మెట్రో పిల్లర్ నం.760 వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహం ఎదురుగా ఈ కార్యక్రమం జరుగనుందని పేర్కొన్నారు.ఒకప్పుడు కూకట్‌పల్లిలో మునులు తపస్సు చేసుకున్న ఆనవాళ్లు కూడా ఉన్నాయని... ఇటువంటి పవిత్ర క్షేత్రంలో ఎన్నో అద్భుతమైన కట్టడాలు, నిత్యం వేల మందికి భోజనాలు, ఉద్యానవనాలు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, యాగశాలలు, యోగా కేంద్రాలు, ప్రత్యేక నెమళ్ల పార్కులు, కోనేరులు ఇలా 540 ఎకరాల స్థలంలో ఉదాసీన్ మఠం వారు నిర్మాణానికి పూనుకోవడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్‌లో ఇది ఒక గొప్ప పర్యాటక ప్రాంతంగా మారబోతుందన్నారు. ఈ పూజా కార్యక్రమాలకు ప్రజలందరూ విచ్చేసి యజ్ఞంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ భవానీనగర్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో రెండో రోజు (గురువారం) పూజలు కొనసాగాయి. ఉదయం జగద్గురు డాక్టర్ శ్రీకాంతేంద్ర స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, హోమాలు, ప్రధాన కలశపూజ, యంత్ర పూజలు, హారతి, మంత్రపుష్పం పూజలు జరిగాయి. ఈ పూజలలో స్థానికులు, విశ్వబ్రాహ్మణులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం చేశామని తెలిపారు. శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. – ఓల్డ్ బోయిన్‌పల్లి


ప్రతిష్ఠించేందుకు బ్రహ్మంగారి విగ్రహాలను తీసుకోస్తున్న ఆలయ నిర్వాహకులు

క్లుప్తంగా

సన్మానం


రెయిన్‌టో విస్టాస్ అసోసియేషన్ వారిని సన్మానిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఎక్కువ డిపాజిట్ చేసిన వారిలో రెయిన్‌టో విస్టాస్ రాక్ గార్డెన్ కమ్యూనిటీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం సైబరాబాద్ ఎస్‌బీఐ డివిజన్ డీజీఎం రెయిన్‌టో విస్తాకు విచ్చేసి అసోసియేషన్ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌టో విస్టాస్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసనకు పెద్దఎత్తున తరలిరావాలి

కూకట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ గ్రౌండ్‌లో ఈనెల 8న జరిగే నిరుద్యోగుల నిరసన దీక్షకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకగాంధీ పాల్గొనున్నారని గురువారం మాజీ కార్పొరేటర్, పీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, మహిళా నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కర్క నాగరాజుకు సన్మానం


శ్రమశక్తి అవార్డు గ్రహీత కర్క నాగరాజును సన్మానిస్తున్న సురేందర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌టీయూ కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు సురేందర్ గురువారం శ్రమశక్తి అవార్డు అందుకున్న కర్క నాగరాజును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. శ్రమశక్తి అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్మికులకు నిరంతరం అందుబాటులో ఉంటూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీజేఆర్ ఫౌండేషన్ సభ్యుడు డాక్టర్ సత్యనారాయణ, వెంకన్న, ఫతేనగర్ సోషల్ మీడియా అధ్యక్షుడు అశోక్, రాజేష్, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని సర్వే నం.18 స్థలాన్ని గురువారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్థలం చుట్టూ కాంపౌండ్‌వాల్ కట్టడానికి అదే విధంగా సున్న చెరువు నాలా పనులు ఎంత వరకు పూర్తయ్యాయో తెలుసుకున్నానని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ రంజిత్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఏసీపీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ప్రాజెక్టు ఆఫీసర్ జాకీర్ రోడ్లు ఇన్‌స్పెక్టర్ వినాయకరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

భాగ్యనగర్‌కాలనీ: జైభారత్‌నగర్ కాలనీవాసులు విజ్ఞప్తి మేరకు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను అధికారులు గురువారం తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివారావు పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో తొలగించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిన చోట వెంటనే మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎలక్ట్రికల్ లైన్‌మెన్ కాళీ, హార్టికల్చర్ సూపర్‌వైజర్ దాసు, రాంకీ సూపర్‌వైజర్ శశి, ఎస్‌ఎఫ్‌ఏ భరత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఆరంభ శూరత్వం..!

- నత్తనడకన డ్రైనేజీ నిర్మాణ పనులు
- రోడ్లపై పారుతున్న మురుగు





అల్లాపూర్ డివిజన్ జ్యోతి నగర్‌లో నూతన డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులకు కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహాబేగం శంకుస్థాపన చేశారు. సంబంధిత శాఖ అధికారులు పనులను ప్రారంభించి వదిలేశారు. దీంతో మురుగు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. సంబంధిత అధికారులకు పనులు ప్రారంభించాలని కోరినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఇటువంటి సంఘటనలు పునరావృత్తం అవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – మోతీనగర్

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

పటాన్‌చెరు టౌన్: తృణ ధాన్యాలు పోషకాలతో నిండి ఉంటాయని, ఏ వయస్సు వారికైనా సులువుగా జీర్ణమవుతాయని, వాటి వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని పశ్చిమ బెంగాల్‌లోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశ్వవిద్యాలయ ఫుడ్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సతరూప ఘోష్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎఫ్‌ఎస్‌ఏ) ఆధ్వర్యంలో 'తృణధాన్యాలు భవిష్యత్ ఆహారం' అంశంపై గురువారం నిర్వహించిన వెబినార్లో ఆమె ప్రధాన వక్తగా పాల్గొన్నారు. 2023 అంతర్జాతీయ తృణధాన్యాల సంవత్సరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తృణధాన్యాలు అత్యధిక పోషక విలువలు కలిగి ఉన్నాయని, అధిక శక్తిని ఇస్తాయన్నారు. తృణధాన్యాలు శరీర కణజాలాన్ని పునరుత్తేజితం చేస్తాయని, మధుమేహ వ్యాధిని తగ్గిస్తాయని, పిత్తాశయ రాళ్లను నివారించడంతో సహాయపడతాయన్నారు. అంతేకాకుండా రొమ్ము కేన్సర్‌ను నిరోధిస్తాయని, బరువు తగ్గడానికి దోహదపడ్డాయన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫుడ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉమామహేశ్వరీ, డాక్టర్ మౌమితా దేవ్, డాక్టర్ పరుల్ థాపర్ తదితరులు పాల్గొన్నారు.


వెబినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ సతరూప ఘోష్

విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



హెచ్‌సీయూలో ఏబీవీపీ నిరసన

రాయదుర్గం: హెచ్‌సీయూలో విద్యార్థుల సమస్యల సాధనకు ఎందాకైనా పోరాడతామని హెచ్‌సీయూ ఏబీవీపీ అక్షయ్ అంగుల్వార్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, యూనిఫామ్ పీహెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్ పద్ధతి అమలు చేయాలని, సీఓఈ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని, ఆన్‌గోయింగ్ సెమిస్టర్‌లో హాజరు సడలింపు ఇవ్వాలని.. తదితరాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మొత్తం 11 డిమాండ్లతో నిరసన చేపట్టామని ,అధికారులు స్పందించకపోతే భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి ఆకాశ్‌భాటి, మాజీ అధ్యక్షురాలు నమ్రతాసింగ్, ఏబీవీపీ నాయకులు తులసీరామ్, ఆయేషా, వికాస్ రితాంజలి, శ్రితికా, ప్రణికా, ప్రశాంత్, సాక్షి, ధరమ్‌వీర్, సురేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంలో నాణ్యమైన బోధన

సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిటైర్డ్ ప్రొఫెసర్ రుమేష్‌చందర్

రాయదుర్గం: నూతన విద్యావిధానం ద్వారా భారత విద్యారంగంలో అనేక మార్పులు వస్తాయని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఢిల్లీ రిటైర్డ్ ప్రొఫెసర్ రుమేష్‌చందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో 'విద్యపై ఆర్థిక నిర్ణయాల ప్రభావం: కొత్త విద్యావిధానం-2020లో ప్రతిబింబాలు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడానికి, పోటీ జాబ్ మార్కెట్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి నూతన విద్యావిధానంలో తీసుకున్న కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ డీన్ ప్రొఫెసర్ సిద్ధిఖీ మహ్మద్ మహమూద్, విద్యావిభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ మోషా హిద్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విని ప్రసంగించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం వివిధ విభాగాల విద్యార్థులు, ఇతర విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇక్రిశాట్ కార్మికులకు అండగా ఉంటాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇక్రిశాట్‌లో పనిచే సే కార్మికులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలో ఇక్రిశాట్ గేట్ వద్ద కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్‌లో పని చేసే కార్మికులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేవిధంగా కృషి చేస్తానని శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు.

పార్ట్‌టైం జాబ్ ఉందంటూ మోసం

- సైబర్ వలలో చిక్కిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
- పెద్ద మొత్తంలో నగదు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఉందంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ. 4.20 లక్షల, మరో ఉద్యోగి 1.30 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బీరంగూడకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 22వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. అది నమ్మిన ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. ఇచ్చిన టాస్కులను పూర్తిచేశాడు. చివరికి తను పెట్టిన రూ. 4.20 లక్షలకు రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి స్పందన లేదు. దీంతో తను మోసపోయినట్టుగా గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఉద్యోగి..

అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 26వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం ఉందంటూ మెసేజ్ వచ్చింది. తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్కులు చేస్తూ వచ్చాడు. చివరకు తను పెట్టిన 1.30 లక్షలకు రెట్టింపైన నగదు ఇవ్వాలని కోరగా ఆ వ్యక్తులు స్పందించలేదు. దీంతో ఆ బాధితుడు మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలి


జేఎన్‌టీయూహెచ్‌లో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎల్, జేఎల్‌లను రెగ్యులరైజ్ చేసిన విధంగా సంవత్సరాల తరబడి యూనివర్సిటీలో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను ప్రభుత్వం పరగణలోకి తీసుకొవాలని కోరారు. అదే విధంగా జేఎల్, డీఎల్‌లను రెగ్యులరైజ్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాయక్, శివారెడ్డి, శివకుమార్, దశరథం, వంశీకృష్ణ, సుధాకర్, నరేందర్, సిద్ధు, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన టర్కీ బృందం


హెచ్‌సీయూలోని ఎస్పైర్ ఇంక్యుబేషన్ సెంటర్ వద్ద టర్కీ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని రిపబ్లిక్ ఆఫ్ టర్కీ రాయబార కార్యాలయ బృందం గురువారం సందర్శించింది. రిపబ్లిక్ ఆఫ్ టర్కీ కాన్సుల్ జనరల్ ఓర్హాన్ యల్మాన్ ఓకాన్, సదుల్లా ఉజున్, ఎర్కాన్ దిలావెరోగ్లు, జైనెప్ డెనిజ్ ఈగితోపాటు టర్కీ ప్రభుత్వ అధికారుల బృందం ఎస్పైర్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించారు. స్టార్టప్‌ల బృందంతో చర్చించారు. ఓర్హాన్ యల్మాన్ ఓకాన్ ఎస్పైర్ బృందానికి శక్తివంతమైన వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి రెండు దేశాల మధ్య ఉమ్మడి కార్యక్రమాలను ప్రారంభించే అవకాశాలను కూడా వివరించారు.

ఫ్రాన్స్‌లో భారత విద్యార్థులకు మంచి అవకాశాలు

సీఎఫ్‌ఐ ప్రతినిధి మిర్రిన్ రైఖాన్


ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రసంగిస్తున్న సీఎఫ్‌ఐ ప్రతినిధి మిర్రిన్ రైఖాన్

రాయదుర్గం: భారతదేశ విద్యార్థులకు ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు ఉన్నాయని క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా (సీఎఫ్‌ఐ) ప్రతినిధి మిర్రిన్‌రైఖాన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఉర్దూ విశ్వవిద్యాలయం, క్యాంపస్ ఫ్రాన్స్ ఇండియా సంయుక్తంగా 'ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యావకాశాలు' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత్‌లోని విద్యార్థులకు ఫ్రాన్స్‌లో విస్తృతమైన అధ్యయన ఎంపికలను అందించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. విద్యావ్యవస్థ, ప్రవేశ అవసరాలు, అందుబాటులో ఉన్న కోర్సుల గురించి విలువైన సమాచారాన్ని విద్యార్థులకు అందించారు. ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ భారతదేశంలో విద్యావ్యవస్థను మార్చే లక్ష్యంతో దేశం కొత్త విద్యావిధానం -2020ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, స్కూల్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్ షకీల్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

2510 మందికి కంటి పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 10 కంటి వెలుగు కేంద్రాల్లో 2510 మందికి పరీక్షలు నిర్వహించారు. 72 మందికి కళ్లద్దాలను అందజేశారు. 15 మందికి ప్రత్యేక కళ్లద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. 44 మందిని కంటి ఆపరేషన్‌లకు సరోజినిదేవి కంటి ఆస్పత్రికి రీఫర్ చేశారు.

భక్తిశ్రద్ధలతో చతుర్వేద పారాయణం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీ ఉదాసీన్ మఠం స్థలంలో దైవిక, సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పలు నిర్మాణాలు చేపట్టనున్నారు. మఠం నిర్వాహకులు గురువారం ఆ నిర్మాణాల భూమిపూజాల్లో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్ల ప్రత్యేక అలంకరణ, ఆరాధనతో పాటు నవగ్రహ వాస్తు పూజలు, వేదహవనం , చతుర్వేద పారాయణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాలు శుక్రవారం వరకు కొనసాగనున్నాయి.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఓబీసీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయడం ఆనందంగా ఉందని ..ఓబీసీలకు విజయం దక్కిందని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద మాట్లాడుతూ భారీ సంఖ్యలో ఓబీసీ పోస్టుల భర్తీకి హెచ్‌సీయూ అధికారులు, పాలకమండలి చర్యలు తీసుకోవడం బీసీ, ఓబీసీ సంఘాల సమష్టి విజయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పిల్లలకు ఆట వస్తువుల అందజేత

బాలానగర్: వేసవిలో ఆటలు అనేవి విద్యార్థులకు ఆటవిడుపు లాంటివని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం స్థానిక చర్చి పాస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యారమ్‌బోర్డు, షటిల్ బ్యాట్, వాలీబాల్ లాంటి ఆట వస్తువులను పండాల ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు.

పీహెచ్‌డీ ఫీజులు తగ్గించాలని నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ ట్యూషన్ ఫీజు పెంపుపై నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం క్యాంపస్‌లోని న్యాయ కళాశాల ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలిపారు. ఫీజులు చెల్లించలేక అనేక మంది విద్యార్థులు పీహెచ్‌డీ అడ్మిషన్లు రద్దు చేసు కుంటున్నారని పెంచిన ఫీజును ఉపసంహరించుకో వాలని వీసీ ప్రొ.రవీందర్‌ను కోరారు. ఈ కార్యక్రమ ంలో నెల్లి సత్య, ఆజాద్, అఖిల్, స్వరాజ్, మధు, మహేష్, వెంకట్, గోవర్ధన్, రవి పాల్గొన్నారు.

మధుశ్రీకి డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలోని ఇన్ఫర్మేటిక్స్ టెక్నాలజీ విభాగం నుంచి జి.మధుశ్రీకి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. వరంగల్ పట్టణానికి చెందిన మధుశ్రీ పీజీ వరకు కేయూలో చదివి, జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. అనంతరం ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది ఎస్‌ఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.గురురావు పర్యవేక్షణలో కంట్రోలింగ్ ఐపీ ఫాల్సిఫ్లయింగ్ యూజింగ్ రీలిస్టిక్ సిములేషన్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేశారు.

బహిరంగ సభకు తరలిరావాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించనున్న విద్యార్థి, నిరుద్యోగ భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున విద్యార్థులు కదిలిరావాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ వరంగల్ రవి కోరారు. గురువారం ఓయూలో తెలంగాణ వర్సిటీలకు వివిధ విద్యార్థి సంఘాల ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు.

స్టాటిస్టిక్స్ పాత్ర కీలకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మానవ దైనందిన జీవితంలో స్టాటిస్టిక్స్ పాత్ర కీలకమని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ యుగేందర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ విభాగం జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ... ఆధునిక యుగంలో స్టాటిస్టిక్స్ లేకుండా ఏ ఆర్థిక లావాదేవీలూ జరగడం లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అనేక వ్యాపార లావాదేవీల్లో స్టాటిస్టిక్స్‌ను ఉపయోగిస్తున్నారని తెలిపారు.